# మనీ అద్దంలో మమతల రూపాలు

ఆదిమధ్యం రమణమ్మ

**"శకుంతలా!" అని పెద్దగొంతుతో అట్టహాసంగా అరుస్తున్నట్లు పిలుస్తూ - శకుంతల ఇంట్లో అడుగుపెట్టింది ఆమె పెద్దక్కగారు భాగ్యం.**

**శకుంతల వంటింటి నానుకుని ఉన్న చిన్న వసారాలో బియ్యం ఏరుకుంటోంది. అక్కగారి రాకకు హృదయం స్పందించినా, మనసు, ముఖం, పూవులా ముడుచుకు పోయాయి.**

"ఏం చేస్తున్నావే పలకవు" అంటూ ఆయాసపడుతూ ఆ వసారాలోకి వచ్చింది భాగ్యం.

"రా అక్కయ్యా, కూర్చో"అంటూ, గోడనిచేర్చిఉన్నపీట వాల్చింది శకుంతల.

తాను వస్తే కంగారుగా లేవనందుకు, సంబరంగా ఎదురు రానందుకు మనసులోనే చిరాకుపడుతూ, ఆ పీట మీదకు తనస్థూల శరీరాన్ని చేర్చింది భాగ్యం. చెల్లెలు ఏరుతున్న బియ్యాన్ని చూసి, "అదేమిటే బియ్యంనిండా బెడ్డలూ, రాళ్ళే! మీ పనిమనిషి బాగుచేయదా" అంది.

ఆ రెండు మాటల్లోని అంతరార్థం సూటిగా వచ్చి శకుంతల అంతర్యాన్ని సూదులతోగుచ్చింది. చిన్నబుచ్చుకున్న మనసుతో చటుక్కున లేచి వంట ఇంటిలోకి వెళ్ళి గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి అక్కగారి కందించింది.

"కొత్త కుండలో నీళ్ళేమిటే గొంతు పట్టెయ్యవుగదా," అంది.

'నీ ఇంట్లో ఫ్రిజ్ తలుచుకుని 'తాగక్కయ్యా'అనాలను కుంది కాని అనలేదు.

చెల్లెలు నుంచి ఏసమాధానం రాకపోయేసరికి అసలు విషయంలోకి వచ్చేసింది భాగ్యం.

శకుంతల మళ్ళీ చేటని ఒళ్ళో పెట్టుకు కూర్చుంది.

చెల్లెలు వాలకం చూస్తే కాఫీ అయినా ఇస్తుందన్న నమ్మకం పోయింది భాగ్యానికి. "ఇంతకీ నువ్వు పెళ్ళికి వస్తున్నావా లేదా?" అందిగుచ్చి చూస్తూ-

"ఎలారానక్కయ్యా? పెళ్ళికి రావాలంటే నగలు,మంచి పట్టుచీరెలు ఉండాలి. అందులోనూ నువ్వుభాగ్యవంతురాలివి. అంతకంటె భాగ్యవంతులతో వియ్యమందుతున్నావయ్యె."

"ఆ ఈ కాలంలో నగలు ఫేషన్‌కాదు. ఉన్నవాళ్ళయినా పెట్టుకోవడంలేదు. ఎవరు వేసుకున్నా చేతులకి గాజులు, మెళ్ళో పుస్తెల తాడున్ను. నీ మెళ్ళో ఆతాడు ఉండనే ఉంది. ఈ కాలంలో బంగారు గాజులు ఫేషన్‌కాదు. బేంగిల్ షాపుల్లో చిత్ర విచిత్రమైన గాజులు వస్తున్నాయి. అవే తీసుకుంటున్నారంతా." అంది చెల్లెలి గాజుల వంక చూస్తూ-

నిండుగా బంగారు గాజులున్న అక్కగారి చేతులకేసి చిరునవ్వుతో క్షణం చూసి తలవాల్చుకుంది శకుంతల. ఇంతలో మరో వెర్రి మనసును దూసుకుపోయింది.

"ఒకటి రెండు పోలిస్టర్ చీరెలతో పెళ్ళికెలా రమ్మంటావ్" అంది తలెత్తి చిరాగ్గా అక్కగారికేసి చూస్తు.

"నావి లేవుటే బోలెడు పట్టుచీరెలు?" అంది భాగ్యం.

"నాన్న అమ్మ వస్తున్నారా?"

"ఆ వస్తున్నారు"

"ఏమోనే.మా ఆయనకు సెలవు దొరకదు.డబ్బాఅంత తొందరగా పుట్టదు!"

"ఛ ఛ ఏమిటే శకూ, నీ మాటలు? పెళ్ళికి మేమే తీసుకువెడతాం. మీ ఆయనకి సెలవు దొరక్కపోతే, నువ్వయినా వచ్చితీరాలి. నా-అన్నవాళ్ళంతా రాకపోతే, పెళ్ళి ఏం సంతోషాన్ని కలిగిస్తుంది! నువ్వింకే అద్దుచెప్పక తయారవు" అని లేచింది భాగ్యం. "పాలేమైనా ఉన్నాయా? ఉంటే కాఫీ పెట్టు" అంది తిరిగి.

అక్కగారు అడిగిన తీరుకు రోషం వచ్చింది శకుంతలకి. ఉన్నా లేవని చెప్పేసింది."మేంసాయంత్రంపాలుతీసుకోవడం లేదక్కయ్యా"అని కూడా చెప్పేసింది.


"ఊ ఏం సంసారాలో ఏంటో" అని నీరసంగా మూలు క్కుంటూ లేచి వెళ్ళిపోయింది భాగ్యం.

* * *

శకుంతల తల్లిదండ్రులకు భాగ్యమే పెద్ద కూతురు. ఆమె తరువాత ఇద్దరూ మగపిల్లలు, ఆ తరువాత ఇద్దరూ ఆడపిల్లలు. సావిత్రి, శకుంతల వారి అదృష్టాలు కూడా వరసక్రమంలోనే వచ్చాయి. భాగ్యం పెద్ద ఇంజనీరు భార్య. మొదటి సంతాన మేమో మస్తుగా డబ్బు ఖర్చుచేసి పెళ్ళి చేసారు. తరువాత ఇద్దరూ కొడుకులు. వారూ మంచి చదువే చదివి మంచి ఉద్యోగాలే చేస్తున్నారు. కానైతే దూర దూర ప్రాంతాల్లో ఉన్నారు. తల్లిదండ్రులని పట్టించుకోరు. వారికి ఉన్న ఆస్తి అంతా కరిగిపోయి వృద్ధాప్యం, ఒక ఇల్లు మిగిలాయి. ఆ ఇంట్లో చిన్నపోర్షను ఉంచుకొని పెద్ద పోర్షను అద్దెకిచ్చి, ఆ అద్దెమీద జీవితం వెళ్ళమారుస్తున్నారు. సావిత్రిని మేనరికం ఇచ్చారు. భాగ్యమూ లేదు లేమీ లేదు. శకుంతల టైమ్ వచ్చేసరికి సంసారం బాగా చితికిపోయింది. శకుంతలని సామాన్య గుమాస్తాకిచ్చి పెళ్ళిచేసారు. శకుంతలకి ఒక బాబు, పాప.

శకుంతల చాలా చక్కనిది. చదువుకున్నది. కణ్వమహర్షి ఆశ్రమంలోని శకుంతలని గుర్తుచేసేరూపు.పసి మల్లెలు, గులాబులు కలబోసినట్లుంటే శరీరఛాయ. అతి సన్నని నడుము. ఒంపులు తిరిగిన శరీరం.వయ్యారంగాపిరుదులమీద నర్తించే నిడుపాటి వాలుజడ.విశాలనయనా యువల్చని పెదవులు, చిన్నినోరు. చూడచక్కగ, ఎదుటి వారి చూపుల్నినిలబెట్టేసే అందం.

అంతచక్కని చెల్లెలు పెళ్ళిలో మెరుపుతీగలామసలాలని, ఎవరావిడ అని అందరూ అడుగుతూంటే, మా చెల్లెలు




అవి గర్వంగా చెప్పుకోవాలని భాగ్యం ప్రగాఢ వాంఛ, తహతహను.

భాగ్యానికి ఇద్దరు ఆడపిల్లలు ఇద్దరు మగపిల్లలు. ఆడపిల్లలిద్దరూ పెద్దవాళ్ళు. పెళ్ళిళ్ళు చేసి అత్తవారిళ్ళకుపంపేసారు. మగపిల్లల్లో పెద్దవాడు రఘు. చిన్న వాడు శేషు. పెద్దవాడు బేంకి ఆఫీసరు. చిన్నవాడు ఇంజనీర్ చదువుతున్నాడు. భర్త ఇంజనీరు. బాగా డబ్బు గడించాడు. పల్లెటూర్లో కొద్దోగొప్పో పొలం, మామిడి తోటా ఉన్నాయి.

తనవాళ్ళంతా దారిద్ర్యంలో ఉండటం, ఆవిడకు చిరాకు అసహ్యం తప్ప సానుభూతి, సహకారాలు లేవు. ఎందుకలా ఉండాలని చిరగింపు తప్ప ఎందుకలా ఉన్నారో అన్నఅవగాహన లేదు. ఆలోచనరాదు.

భాగ్యం వచ్చి మరీమరీ బలవంతం చేయడం వల్ల పెళ్ళికి వెళ్ళడం తప్పదు కాబోలు అనుకుంది శకుంతల. లోలోపల న్యూనతా భావం నీరసింపచేస్తున్నా అక్కగారు చీరెలు ఇస్తానని భరోసా ఇవ్వడంవల్ల ధైర్యం తెచ్చుకుంది. ఫర్వాలేదు అని మనసుకు సర్ది చెప్పుకుంది.

తాను రావడానికి వీలుకాదని శకుంతలనీ పిల్లల్నీ వెళ్ళమన్నాడు ఆమె భర్త. అతనికి శకుంతలంటే ప్రాణం. ఎంతో



అపురూపంగా చూసుకుంటాడు. ఏదైనా ఉద్యోగం చేస్తానన్నా చేయనియ్యడు. "నీకు ఇంటా బైటా హైరాన. ఇద్దరేగా పిల్లలు. వారికోసం ఎంతయినా శ్రమిస్తాను. నీవు పిల్లల్నీ ఇల్లునీ చూసుకుంటూ నిడపట్టున ఉండు చాలు" అంటాడు.

రెండే రెండు సాదాచీరెలు, రెండు పోలిస్టర్ చీరెలు, ఒకే ఒక జరీచీరా వేసుకుని పెళ్ళికి బయలుదేరింది శకుంతల. రాత్రి ప్రయాణం. తెల్లవారి పెళ్ళివారి వూరు చేరారు.

పెళ్ళివారిది పట్నమే. స్టేషన్‌కి కార్లు చాలానే తెచ్చారు పెళ్ళివారు. అంతా విడిది సమీపానికి వస్తుండగా కార్లు దిగారు. మేళతాళాలతోనే మగపెళ్ళివారిని తీసుకువెడుతూ బారులు తీరి నించుని పువ్వులు విసిరారు.

శకుంతలకి చాలా చాలా నవ్వొచ్చింది. దేశ నాయకులకీ, పుణ్యపురుషులకీ, కళాకారులకీ జరిగే సత్కారం ఇది.

మెరుపు తీగలా నడిచొస్తున్న శకుంతల మీదే పెళ్ళివారి చూపులన్నీ కేంద్రీకృతమయ్యాయి. అబ్బురంగా చూస్తున్నవారి కన్నులు మెరుస్తున్నాయి.

భాగ్యానికి కొంత గర్వంగా ఉన్నా కొంత అసూయగా కూడా ఉంది.

తననీ, తన నగల్నీ వియ్యపురాలి హోదానీ గౌరవిస్తున్నా అది తెచ్చిపెట్టుకున్నట్లుగా తెలుస్తూనే ఉంది. నిజమైన ప్రశంసలు చెల్లెలికే చెందుతున్నట్లుగా స్పష్టంగా తెలిసిపోతోంది. ఏదో తెలియని ఈర్ష్యతో మనసు ఉక్కిరిబిక్కిరి అవుతోంది. అంత సంతోష సమయంలోను మనసు చల్లగా లేదు. కుతకుతా ఉడుకుతోంది.

పెళ్ళివారు పెద్దమేడ విడిదిగా ఇచ్చారు. క్రిందా పైనా బోల్డు గదులు చక్కని ఆధునిక సదుపాయాలతో ఉంది. కుటుంబానికో గది తీసుకున్నా సరిపడినన్ని గదులు. ప్రతీ గదిలోనూ మంచాలు పరుపులు. కూజాలతో మంచినీళ్ళు డ్రస్సింగ్ టేబిళ్ళు. 'అబ్బ! ఎక్కడి నుంచి సంపాదించేసారీ సదుపాయాలన్నీ!' అన్నంత ఆశ్చర్యంగా అద్భుతంగా ఉన్నాయి ఏర్పాట్లు.

స్నానపానాలు ముగించి, ముస్తాబులై, ఫలహారాలు చెయ్యడానికి పెళ్ళివారింటికే వెళ్ళారు. శకుంతల జానెడు వెడల్పున్న ఎర్రని వెంకటగిరి జరీ చీర కట్టుకుంది. అది ఈనాటి నేతాకాదు. ఈనాటి జరీకాదు. శకుంతల అత్తగారు అపురూపంగా దాచుకొని వైధవ్యం ప్రాప్తించగా కోడలికిచ్చేసిన చీర. పూర్వకాలం జరీ. వేయి నగలు పెట్టుకున్నట్లుందా జరీ అంచు. ఆ ఎరుపు చీరలో శకుంతల ముద్ద మందారమా? ముద్దొచ్చే ఎర్రని గులాబీవా, దానిమ్మ పువ్వా? ఏకొమ్మన పూచిన పూబోణి అన్నట్లుగా ఉంది.

పెళ్ళి కొచ్చిన వారంతా అది ఆమె అందమా చీర అందమా అన్నట్లు మార్చి మార్చి చూస్తున్నారు. స్నాతకం విడిదింట్లోనే జరిగింది. పెళ్ళికొడుకు కాశీ వెళ్ళేటప్పుడు ఫోటోలు తీస్తుంటే "రావే రావే ఇలా నా ప్రక్కననించో"

# నవంబర్ 19న మద్రాసులో జరిగిన రాజాలక్ష్మి ఫౌండేషన్ ఉత్సవ దృశ్యాలు



నాటి కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించిన డాక్టర్ షావుకారు జానకి కూచిపూడి ఆర్ట్ అకాడమీ వారి నాట్య ప్రదర్శనకు ముందు డాక్టర్ వెంపటి చిన సత్యంను, కుమారి కమలారెడ్డి, కుమారి శశికళలను సత్కరించారు.

అని హడావిడి పెట్టేసింది భాగ్యం. "పిన్నీ నా ప్రక్కకిరా నవ్వు ముఖం పెట్టు" అన్నాడు పెళ్ళికొడుకు.

ఇద్దరి ఆరాటం చూసి సగర్వంతో ఫక్కున నవ్వింది శకుంతల. మల్లె మొగ్గలాంటి ఆ పలువరసని చటుక్కున కెమెరాలో పట్టేసాడు ఫోటోగ్రాఫరు. గెడ్డంక్రిందబెల్లం పెట్టి పట్టుకున్న బావమరిదీ నవ్వాడు. అతని ఎత్తు పళ్ళూ ఫోటో కెక్కేశాయి.

రకరకాల పచ్చళ్ళు,కూరలు, పిండివంటలతో భోజనాలు ముగిసాయి. విశ్రాంతి తీసుకున్నారు. ఆపై కాఫీ ఫలహారాలు ముగిసాయి. ఆ తరువాత తోటలో దిగడం,ఎదురు సన్నాహం తంతు హడావిడి.

సాయంత్రమే కొడుకు సుందర్‌కి, కూతురు బిందుకి, తెల్లటి డ్రెప్ వేసి తాను పెళ్ళయిన కొత్తల్లో భర్త మురిపెంగా కొన్న పాము కుబుసంలాంటి తెల్లని పాలిస్టర్ చీర కట్టింది. ఆ చీరలో శకుంతల మల్లెపూలా మంచి ముత్యమా ఏమిటీ మెలో ప్రత్యేకత? ఇపుడే విరిసిన నంది వర్ధనం పువ్వులా ఉందే? అని ఆశ్చర్య సంభ్రమంతో ఎన్నిజతల కళ్ళు మురిపెంగా చూస్తున్నాయీమెను!

రాత్రి పెందరాళే భోజనాలు ముగించి తొందరగా నిద్రలు తీయమని ఒకరినొకరు హెచ్చరికలు చేసుకున్నారు. తెల్లవారుజాము 4 గంటలకు పెళ్ళి.

సావిత్రి, శకుంతలా పిల్లలు ఒక గదిలో. ఆమె తల్లీ తండ్రీ, సావిత్రి పిల్లలు వేరొక గదిలో పడుకున్నారు. సావిత్రి హాయిగా నిద్రపోతోంది. శకుంతలకు నిద్రపట్టడం లేదు. పట్టుచీరలేవో సర్దుతానన్న అక్కగారు ఇంత వరకు ఆ ఊసు ఎత్తలేదు! అడగడానికి అభిమానం అడ్డువస్తుంది అక్కగారే అయినా తనకున్నరెండు మంచి చీరెలూ కట్టేసేసింది. దైవదత్తమైన అందం వెల్తిపడకుండా తనని కొంత కాపాడు తోంది. అసలు అక్కగారికి, చెల్లెలు పెళ్ళికి రావాలనే ఆత్మీయత కాక, చెల్లెలి అందం అందరికీ చూపి గర్వించాలనే తపనతోనే తనని తెచ్చింది. ఆవిషయం అంతరాంతరాల్లో సలుపుపెడుతున్నా తను ఎవరిని ఏం చేయగలదు? అందినంత వరకే సంతోషం అనుభవించాలని వచ్చింది. సావిత్రికీ రెండు పట్టుచీరల కంటే లేవు. ఒకటి కట్టేసింది. రెండోది పెళ్ళి టైములో కడుతుంది. తల్లికి అసలే లేవు. ఇందరిని గుర్తించి సమ్మతించాలి భాగ్యం, బలవంతపెట్టి లాక్కొచ్చింది కాబట్టి. కాని ఆవిడకి అసలు ఒళ్ళు తెలుస్తుందా?

శకుంతలకి రాత్రి అంతా కలత నిద్రే అయింది. పరీక్షా సమయం వస్తున్నట్లుగా బలపడిపోతోంది శకుంతల. భాగ్యం గదిలోకి వచ్చింది. భాగ్యం తల్లితో ఏవో పెళ్ళి విషయాలు తమకి, ఆడ పెళ్ళివారి నుంచి ఏమేమి వస్తాయో సంప్రది స్తోంది. రావే శకూ అనిపిలిచింది. పసుపుతాడుతో తల్లిమెడ బోసిగా వెల్తిగా ఉండటం వల్ల చటుక్కున తన మెల్లో ఓ గొలుసు తీసి తల్లిమెడలో వేసింది భాగ్యం. ఓహో స్పృహ లోనే ఉందన్న మాట అనుకొని తన విషయం అడగలేక, "అమ్మకి పట్టుచీర ఇస్తానన్నావుగదే" అంది.

చిరాగ్గా ముఖం చిట్లించింది భాగ్యం. "అన్నీ కొత్తని గడివిప్పనివే తెచ్చానే. పాతవి తేలేదు" అంది.

ఆ మాటకి ఆ తల్లి గుండెల్లో బాకు దిగినట్లుగా విలవిల్లాడింది. వెలాతెలాబోతున్నముఖం దించుకొని "వద్దమ్మా పట్టుచీర. నాకున్న జరీదే ఏదో కట్టుకుంటాలే" అంది.

శకుంతల గుండెలు పెట్రోలుపోసి అగ్గిపుల్లగీసినట్లుభగ్గున మండేయి. చురుగ్గా భాగ్యాన్ని ఓచూపు చూసి గిరుక్కున తిరిగి తనగదిలోకి వచ్చేసింది. 'తల్లికే ఇవ్వనిది తనకేమి ఇస్తుంది? ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలి? పెళ్ళికి ఏ చీర కట్టాలి? ఉన్నవి రెండూ కట్టేసిందే. కట్టినదే కట్టడం - లేమిని ఎత్తిచూపుతుంది. ఎంత చేసింది భాగ్యం? తను ఏం చేయ గలదు? ఏంచేయాలి! పేదవారి కోపం పెదవికి చేటు విలవిల్లాడిపోయింది.

శకుంతల చూపులోని చురుకు కాస్త తెలివి తెప్పించింది భాగ్యానికి. కాని అది రావలసిన తెలివికాదు. కోపం, అహంతో "రా అమ్మా తల్లీ, నీకు నచ్చిన చీర కట్టుకో" అని తల్లిని బలవంతం చేసి పెట్టె దగ్గరకు లాక్కుపోయింది తల్లిని. కూతురు ముందు అంతమాటఅన్నాక ఎలాకట్టుకుంటుంది? ససేమిరా వద్దన్నారు రంగమ్మగారు. "నువ్వు కట్టకపోతే నామీద ఒట్టు" అంది భాగ్యం. పైగా తల్లి తటపటా యిస్తుంటే "నే పెళ్ళికే తల్లవెళ్ళను" అంది.

'ఇలాంటి వారితో ఏదొచ్చినా చావే' అని తిట్టుకుంటూ తప్పని సరిగా ఓ చీరకట్టుకుందా తల్లి.

ఇద్దరూ కలిసి సావిత్రీ శకుంతలా పడుకున్న గదిలోకి వచ్చారు. సావిత్రి అప్పటికే తన రెండో పట్టుచీర కట్టి తయారయిపోయింది. ఆ సుప్రభాత సమయంలో మంగళ వాయిద్యాలు మహోత్సాహాన్ని కలిగిస్తుంటే, శకుంతలకి - అమ్మవారి జాతరకి అమాయకమేకని తోలుకెళుతున్నట్లు - పుణ్యకాల రణరంగ వాయిద్యాలుగానో వినిపిస్తూ మనసును గాబరా పెట్టేస్తున్నాయి. ఏంచేయడానికీ పాలుపోకపోయినా బుర్ర చురుగ్గానే పనిచేస్తోంది.

శకుంతల తయారయి పోవడం చూసి - "ఇంకా తయారవ లేదుటే! లేలే త్వరగా శకూ, అమ్మకి చీర ఇచ్చాన్లే" అంది.

తను తయారవలేదు! ఎలా తయారు చేయాలో అక్కగారు మరిచిపోయింది. తనమాట మరిచినా తల్లి గౌరవమయినా కాపాడినందుకు సంతోషించింది.

"మీరు వెళ్ళండి. నాకు తలనొప్పిగా వుంది. రాత్రంతా నిద్రపట్టలేదు. తరువాత వస్తా" అంది.

ఒకటి రెండుసార్లు చెప్పి వారు వెళ్ళిపోయారు. వారితో పిల్లల్ని తయారుచేసి పంపింది.

అంతా పెళ్ళివారింటికి బాజాభజంత్రీలతో తరలి వెళ్ళి పోయారు. శకుంతల ఎంతకీరాకపోయేసరికి తల్లికిఅనుమానం

వచ్చి పెళ్ళి మధ్యలో విడిదింటికి వచ్చింది.

తల్లిని చూడగానే శకుంతల కడుపు పట్టుకుని 'నొప్పి' అని విలవిలా తన్నుకోడం ప్రారంభించింది.

"అయ్యో తల్లీ ఏంటయిందమ్మా" అని గాభరా పడిపోయిందావిడ.

"ఏం లేదమ్మా నువ్వంతలా గాబరా పడకు. కాస్త సోడా పంపించు చాలు. నువ్వెళ్ళు. అక్కడ పెళ్ళి జరుగుతోంది. బాగోదు" అంది.

ఆ తల్లి అయిష్టంగానే మళ్ళీ వెళ్ళింది. ఎవరో కుర్రాడు సోడా తెచ్చాడు. ఆ తరువాత వాముకషాయం. ఆ తరువాత కాఫీ. అన్నీ నవ్వు ఏడ్పుతో త్రాగింది.

పెళ్ళి ముగిసింది. భాగ్యం వచ్చింది. "ఏంటయిందే శకూ? పెళ్ళిలో సరదాగా తిరుగుతావనుకుంటేను - పెళ్ళివారికి చెప్పాంలే డాక్టర్ని పంపిస్తారు" అని గిరుక్కున తిరిగి తనగదిలోకి వెళ్ళిపోయింది.

'నా సరదా అంతా నువ్వే చంపేసావు అక్కయ్యా - రానంటే బలవంతంచేసి తెచ్చావు గదే -' అని మనసులోనే వాపోయింది.

భాగ్యం తిరిగి తన గది గుమ్మం వేపొచ్చి - గుమ్మంలో ఉన్న తల్లితో "దానికంతా నన్ను చూస్తే ఈర్ష్యాదుఃఖమూను. ఎలా చేసిందో చూసావా?" అంది.

మెల్లగా అన్న ఆ మాటలు శకుంతలకి వినిపించాయి.

"అమ్మా! చాచిపెట్టి ఒక్క లెంపకాయ కొట్టుదాన్ని. నువ్వు తల్లివి. నీకా హక్కుంది" అని అరవాలని పించింది శకుంతలకి.

పడకవేసిన శకుంతల లేవలేదు. ఎందరోవచ్చిపరామర్శలు చేసారు. డాక్టర్‌వచ్చి పరీక్షించి, ఇంజక్షన్ చేసి మందులిచ్చి వెళ్ళాడు.

మనసుకు చాలక శరీరానికి కూడా సూదిపోట్లుశకుంతలకి కళ్ళ నీళ్ళు తిరిగాయి.

పెళ్ళి విందు భోజనం చేయవలసిన శకుంతలకి బ్రెడ్డు, పాలు. తల్లి, పిల్లలు శకుంతలని వదలలేదు.

భోజనాలయ్యాక చాలా మంది ఎవరిదారిన వారు వెళ్ళి పోయారు.

# పాపం

ఎందుకేడుస్తున్నారు వాళ్ళు
ఎవరు పోయారని?
అదా? నువ్వు ఎదిగిపోయావని

—డాక్టర్ సి.నారాయణరెడ్డి

సావిత్రి భర్త పిల్లలు కూడా వెళ్ళిపోయారు. "శకుంతలని నేచూస్తాలే" అని తల్లినీ తండ్రినీ కూడా పంపేసింది భాగ్యం.

శకుంతలగదిలో శకుంతలా పిల్లలే మిగిలారు.

తల్లికి కడుపునొప్పి రావడం, తల్లిఅభోజనంతోఉండటం శకుంతల కొడుకు సుందర్ చిన్నారి మనసును చాలా బాధించాయి. జేబులోంచి జాంగ్రీతీసి "అమ్మా జాంగ్రీ అంటే నీకెంతో ఇష్టం కదమ్మా. తిను" అన్నాడు.

చటుక్కున పిల్లవాణ్ణి దగ్గరికి తీసుకుని వెక్కివెక్కి ఏడ్చింది.

"ఎక్కడిది నాయనా చాటుగా తెచ్చావా? తప్పుకదూ" అంది.

"ఛా లేదమ్మా. పెద్దమ్మ ఇచ్చింది. తినకుండా దాచి తెచ్చాను" అన్నాడు.

అంతగా ఆహ్వానించిన అక్కగారు తనని పట్టించుకోవడం లేదు. వెళ్ళిపోవాలని ఉంది. కాని చేతిలో డబ్బు లేదు. భర్త వంద రూ. ఇచ్చాడు. 50 రూ. పెళ్ళి కొడుక్కి ఇచ్చి, 50 రూ. తనదగ్గర ఉంచుకోమన్నాడు. గొప్పకి పెళ్ళికొడుక్కి నూటపదహార్లు చదివించేసింది. తన దగ్గర రైలు చార్జీలు లేవు. ఇష్టమైనా కష్టమైనా ఆవిడగారితోనే వెళ్ళాలి అని ఆలోచిస్తుండగా-

భాగ్యం వచ్చింది "డాక్టర్ ఇంజక్షన్ చేసాక ఇప్పుడు నయంగా ఉందా శకుంతలా?" అంది. నీ జబ్బేమిటో నాకు తెలుసులే అన్న ధోరణిలో.

"ఊ బాగా తగ్గిపోయింది" అని చటుక్కున లేచి కూర్చుంది శకుంతల.


"బావా శేషు కూడా వెళ్ళిపోయారు. నన్ను, ఆడపిల్లల్ని వియ్యాలవారు ఉండమన్నారు. మేం రేపో ఎల్లుండో వస్తాం. నీకు వెళ్ళిపోవాలనిపిస్తే వెళ్ళిపోవచ్చు" అంది. నువ్విక వెళ్ళవచ్చు అని మర్యాదగా చెప్పింది. జోడు తీసుకుని తన్నాలని ఉంది. కాని ఆపనిచేయలేదు. 'అసలే ఒళ్ళు మండుకుపోతుంటే, ఆ మనిషిని డబ్బెలా అడుగుతుంది? డబ్బు లేందే ప్రయాణమెలాగ? ఈ ఏడుపు తల్లీవాళ్ళూ ఉన్నప్పుడు చెప్పి ఏడిస్తే వాళ్ళదగ్గర తీసుకుని వాళ్ళతోపాటే వెళ్ళిపోదును!' దుఃఖంతో కళ్ళనీళ్ళు తిరుగుతుంటే తలవంచుకుంది.

'పెళ్ళి కొచ్చి ఏమిచేస్తావా?' మనసులోనే పళ్ళు పిండుకుంటూ బైటికి వెళ్ళిపోయింది భాగ్యం.

'పెళ్ళికి తీసుకువచ్చి ఇంత అవమానం చేస్తావా అక్కయ్యా! చిన్నపిల్లనైనా అయితినికాదే, కొరికి రక్కిపోగులు పెడుదును. ఏళ్ళురావడం ఎంతపాపమే' అనుకుంది శకుంతల.

ఆ తరువాత ఆవిడ బుర్ర చురుగ్గా పనిచేసింది. ఉపాయమూ దొరికింది. భగవంతుడు, తనఆపదకు అడ్డు పడుతున్నందుకు సంతోషము శక్తి వచ్చాయి. పెట్టె సర్దుకొని భాగ్యాన్ని తన గదిలోకి పిలుచుకొచ్చింది.

"అక్కయ్యా నీ సంగతి నాకు బాగానే తెలుసు. కాని పెళ్ళికి తీసుకువచ్చి ఇలా చేస్తావనుకోలేదు! పెళ్ళికి ముందు మా ఇంటికొచ్చి పిలిచిన పిలుపు గుర్తుతెచ్చుకో. మీ వియ్యాలవారు నిన్ను, పిల్లల్ని ఉండమని మమ్మల్ని వెళ్ళిపొమ్మన్నారా? మమ్మల్నందర్నీ ఉండమని బలవంతం చేయడం నేను విన్నాను. వాళ్ళుదరిద్రులూకా[illegible] అయినాఉండమంటే ఉండిపోతారా? మేమెవరం, మధ్య ఉం[illegible] ఉండం. అమ్మనీ నాన్ననీ ఉంచి, నువ్వూ ఉండవే, సిం[illegible] తీసుకువెళ్ళి చూపించవచ్చు- మీ వియ్యాలవారికి పేటన్ని కార్లు ఉన్నాయి. కలిమిలేక పోయినంత మాత్రాన కన్నవారు తల్లిదండ్రులు కాదటే!



రాజాలక్ష్మీ అవార్డు ప్రదానోత్సవంలో పాల్గొన్న డాక్టర్ జి.కె.రెడ్డి, శ్రీ సి.సుబ్రహ్మణ్యం
డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావును సత్కరిస్తున్న డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి.

అమ్మనెంత అవమానించావ్? నీకులా మాకు డబ్బు లేకపోవచ్చు. కాని, నీకు లేనివెన్నో మాకున్నాయి. మా వారి బంధువులున్నారీ వూళ్ళో. అక్కడికెళ్ళి ఆయన సహాయంతో ఈ రాత్రి బండి ఎక్కేస్తాను. ఎప్పుడూ ఇలాంటి వెధవ పిలుపులు పిలవకు, తెలిసిందా? ఇక వెళ్ళు-''

అని పెట్టెనీ పిల్లల్నీ తీసుకుని క్రిందకు దిగిపోయింది.

చెల్లెలు మంచు దెబ్బల్లాంటి మాటలు విసరుతుంటే నోటమాటరాక తెల్లబోయి నిల్చుండిపోయింది భాగ్యం.

* * *


పెళ్ళినుంచి వచ్చాక సత్యన్నారాయణ వ్రతం, బంధువులకి భోజనాలు పెట్టుకున్నారు. రిసెప్షన్ మాత్రం రఘు తన ఆఫీసులోని కొందరు ఆఫీసర్స్‌కి, దగ్గర మిత్రులకీ ఒక హోటల్లో ఏర్పాటుచేసాడు.

పట్టుచీరా పట్టెడు నగలుతో భాగ్యమూ బయలుదేరింది.

''అమ్మా నువ్వు రావద్దు. బాగోదు. పట్టుచీరా, ఆ నగలుతో అమ్మవార్లా ఉన్నావు. అక్కడికంతా రకరకాల ఫేషన్స్‌తో లేడీస్ వస్తారు. నీకు ఇంగ్లీష్ మాట్లాడ్డమైనా రాదు. శకుంతలక్కయితే అన్నివిధాలా బాగుంటుంది. బాగా ఇంగ్లీష్ మాట్లాడుతుంది'' అని పెళ్ళికూతురుతో సహా కార్లో తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

భాగ్యానికి మెరుపుకొట్టినట్లు అయింది. మొహం తిరిగి నట్లయింది. 'తల్లిని ఎంతమాటన్నాడు? అదీ కొత్త పెళ్ళి కూతురు కోడలు ముందు. అపుడే అమ్మ అక్కరపోయిందీ? తల్లికంటే గొప్పవారెవరు?'

''అమ్మాయి ఎవరో పిలుస్తున్నారే'' అని భాగ్యం తల్లి




వెనకనుంచి పిలుస్తుంటే వెనక్కి తిరిగి తల్లిని చూసి గతుక్కుమంది భాగ్యం.

* *

కారు శకుంతల గుమ్మం ముందు ఆగింది.

ముందు గదిలో వున్న శకుంతల చటుక్కున లేచి గదిబైటికి వచ్చింది. అప్రయత్నంగా వెనకనుంచీ గది తలుపు జేరవేసి నూతన దంపతులకు ఎదురు వస్తున్నట్లుగా మెట్లుదిగి ముందుకు వచ్చింది.

''పిన్నీ!నువ్వు సత్యనారాయణ వ్రతానికి రాలేదు. ఈవేళ రిసెప్షన్. తప్పక రావాలి. వస్తేగాని ఊరుకోను. త్వరగా తెములు. నిన్ను కారులో తీసుకుపోదామనే వచ్చాను'' అన్నాడు.

''నేను రాలేనురా'' అన్నది నవ్వుతూనే.

''ఎందుకు రాలేవు?'' అన్నాడు ఆశ్చర్యంగా.

రఘు ప్రక్కన పెళ్ళికూతురు లేకుంటే ఏమన్నా అనేదే- కాని సమ్మళించుకుంది. ''మీ అమ్మని తీసుకువెళ్ళరా. నాకు కడుపులో నొప్పి వస్తోంది. నేను రాను'' అంది అదే చిరునవ్వుతో- అని - నిర్లక్ష్యంగా వీధిలో కూరలమ్మిని పిలవడానికన్నట్లు గేటు దగ్గరకు వెళ్ళింది- రఘుకి విభ్రాంతిగానే ఉంది పిన్నిమాట - చర్య చూస్తే.

ఆమె చిరునవ్వే చెబుతోంది కడుపు నొప్పివట్టేదని.

తమని చూసి ఉబ్బితబ్బిబ్బై లోనికాహ్వానించ వలసిన మనిషి - తమకోసం ముందుకు వస్తూనే వెనక తలుపులు జార్లవేసింది. పైగా తన ఆహ్వానాన్ని గడ్డిపోచగా తీసిపారేసి - తమని గుమ్మం ముందు దారిలోనే వదిలి ముందుగేటు దగ్గరకు వెళ్ళిపోయింది.

పిన్ని ప్రవర్తన - మెత్తని చెప్పుతో కొట్టినట్లుగా ఉంది.

పెళ్ళికూతురు దగ్గర బైట పడకూడదని - వెనక్కి గబగబా వచ్చి కారెక్కించేసాడు చెయి పట్టుకుని. కారెక్కి పిన్నికి టా టా చెప్పాడు. నవ్వుతూనే.

''ఆవిడ అలా ఉన్నారేం?'' అని పెళ్ళి కూతురు అడగనే అడిగింది.

''అలా అన్నారేం'' అన్నట్లు వినిపించింది రఘుకి. ''కడుపు నొప్పి అని చెప్పిందిగా'' అన్నాడు పైకి. మనసులో -'పెళ్ళిలో అమ్మ ఏదో ఆవిడ మనసును తీవ్రంగాగాయపరిచిఉంటుంది. లేకుంటే పిన్ని అలా చేయదు' అని నిరాశగా నిట్టూర్చాడు.

